నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసి శ్రీకాకుళం రెండో డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19వ తేదీన డయల్ యువర్ ఆర్‌టిసి డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని పాతపట్నం, జలుమూరు, హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్ పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస ప్రాంతాల ప్రజల రవాణా సమస్యలు, సూచనలు తెలియజేయాలని కోరారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 9959225609 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

ఇస్తామన్నవే అడుగుతున్నాం

- సిఎం ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదు
- ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న అంగన్వాడీలు
- ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నా
- సమ్మెకు టిడిపి, కాంగ్రెస్ పార్టీల మద్దతు

శ్రీకాకుళం అర్బన్ : ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

తాము గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, కొత్తగా డిమాండ్లు ఏవీ చేయడం లేదని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇస్తామన్న హామీలనే అమలు చేయాలని అంగన్వాడీలు డిమాండ్ చేస్తున్నారు. కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారానికి ఏడో రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సమ్మెకు టిడిపి, కాంగ్రెస్ పార్టీల నాయకులు సంఘీభావాలు తెలిపారు.

శ్రీకాకుళం నగరంలోని ఆర్అండ్‌బి బంగ్లా వద్దకు పెద్దసంఖ్యలో చేరుకున్న అంగన్వాడీలు, అక్కడ్నుంచి ఆర్‌డిఒ కార్యాలయం ఉండే కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్దకు ప్రదర్శనగా వెళ్లారు. సమస్యలు పరిష్కరించాలని పెద్దపెట్టున నినాదాలతో హోరెత్తించారు. అక్కడ బైఠాయించి ధర్నా చేపట్టారు. వినతిపత్రం స్వీకరించేందుకు ఉన్నతాధికారులు రావాలని నాయకులు డిమాండ్ చేశారు. ఒకటో పట్టణ సిఐ సన్యాసినాయుడు జోక్యం చేసుకొని ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫరెన్స్ ఉన్నందున ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ ధర్నా శిబిరం వద్దకు హాజరై వినతిపత్రాన్ని స్వీకరించారు. ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కళ్యాణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, ఎ.మహాలక్ష్మి, కార్యదర్శి ఎన్.వి రమణ, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు పి.లతాదేవి, జె.కాంచన, కె.సుజాత, టి.రాజేశ్వరి, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో అంగన్వాడీలు నినాదాలు చేస్తూ ప్రదర్శనగా వెళ్లి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు వినతిపత్రం అందించారు. అంగన్వాడీల ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు సంఘీభావం తెలిపారు. సమస్యల పరిష్కారం వరకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, నాయకులు ఎన్.షణ్ముఖరావు, హెచ్.ఈశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ, బి.ఆదిలక్ష్మి, బి.రమణమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకులు కోత మధుసూదనరావు, కె.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ రైల్వేస్టేషన్ కూడలి నుంచి పలాస ఆర్‌డిఒ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ అంగన్వాడీలు ప్రదర్శన చేపట్టారు. అక్కడ బైఠాయించి ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయ ఎఒ పి.బాలకు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, కాంగ్రెస్ నాయకులు దువ్వాడ జీవితేశ్వరరావు తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గౌతు శిరీష మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, లోకేష్ దృష్టికి తీసుకెళ్లి, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శులు ఎన్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.మంజులా కుమారి, ఎన్.హైమావతి, కె.హైమావతి, వి.హేమలత, ప్రజా సంఘాల నాయకులు ఎన్.ముఖలింగం, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇచ్ఛాపురంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.చక్రవర్తి, ఆలీంఖాన్, యుగంధర్ తదితరులు తహశీల్దార్ మీనాదేవికి వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీల సమ్మెతో కేంద్రాలు మూతపడడంతో పౌష్టికాహారం పంపిణీ కాక శిశువులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. న్యాయమైన అంగన్వాడీల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

ఇచ్ఛాపురం : తహశీల్దార్ మీనాదేవికి వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సమస్యలు పరిష్కరించకుంటే ప్రభుత్వ యంత్రాంగం దిగ్బంధం

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ప్రభుత్వ యంత్రాంగాన్ని దిగ్బంధిస్తామని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళ్యాణి, డి.సుధ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం, అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టాలని ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించినా చాలాచోట్ల పగులగొట్టారని, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు అనేక సేవలందిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడం లేదని విమర్శించారు. ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనాలతో జీవనం గడపడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన బిల్లులన్నీ సకాలంలో చెల్లించక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. తెలంగాణ కంటే రూ.వెయ్యి ఎక్కువ జీతం ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి హామీ నాలుగున్నరేళ్లయినా నెరవేరలేదని విమర్శించారు. 2022లోనే సుప్రీంకోర్టు అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని తీర్పు ఇచ్చినా నేటికీ రాష్ట్రంలో అమలు చేయడం లేదని చెప్పారు. 48 ఏళ్లుగా పనిచేస్తున్న అంగన్వాడీలు కనీసం సర్వీసులో ఉండి చనిపోతే మట్టి ఖర్చులు కూడా ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర ధరలకు తగ్గట్టు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.ఐదు లక్షలకు పెంచాలని, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచాలన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుంటే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

టెక్కలి రూరల్ : ఆర్‌డిఒ కార్యాలయానికి ప్రదర్శనగా వస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

పలాస : అంగన్వాడీ కార్యకర్తలకు సంఘీభావం తెలుపుతున్న గౌతు శిరీష

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి తదితరులు

సమగ్ర భద్రతా ప్రణాళికను రూపొందించాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వచ్చే ఏడాది జరుగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ముందు, ఎన్నికల సమయంలో, తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్ర భద్రతా ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి కలెక్టర్, ఎస్‌పి, జాయింట్ కలెక్టర్‌తో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 22, 23 తేదీల్లో విజయవాడలో కేంద్ర ఎన్నికల సంఘం సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో కలెక్టర్, ఎస్‌పి సమగ్ర నివేదికలతో హాజరు కావాలన్నారు. శిక్షణ, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూం, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద రాష్ట్ర పోలీసు బలగాల అధికారులతో కలిసి భద్రతాపరమైన అంశాలు, ఏర్పాట్లపై సమగ్ర ప్రణాళికను రూపొందించుకోవాలని ఎస్‌పికి సూచించారు. అన్ని ఇతర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో కచ్చితమైన ప్రణాళిక, క్రమమైన సమగ్ర సమీక్షలు నిర్వహించుకుంటే ఎన్నికలను సజావుగా నిర్వహించవచ్చని చెప్పారు. గడిచిన రెండు సాధారణ ఎన్నికల్లో మద్యం, నగదు, బహుమతుల పంపకాల్లో నమోదైన కేసులను పరిశీలించాలని, వాటి ప్రవాహాన్ని అడ్డుకునే కచ్చితమైన ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. స్వాధీనం చేసుకునే నగదు, మద్యం, ఇంకా ఓటర్లను ప్రలోభపెట్టే ఎలాంటివి దొరికినా వెంటనే ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితా వెలువడిన నాటి నుంచి ఇప్పటివరకు ప్రగతిని అంశాల వారీగా అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

జనవరి 5న చలో విజయవాడ

- ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.26 వేలు ఇవ్వాలి
- ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీరామిరెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధి హామీ చట్టం అమల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీరామిరెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే జనవరి ఐదో తేదీన చలో విజయవాడ తప్పదని హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, పనిదినాల టార్గెట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మున్సిపాల్టీ పరిధిలో విలీనమైన గ్రామ పంచాయతీల్లోనూ యథావిధిగా ఉపాధి హామీని అమలు చేసి ఫీల్డ్ అసిస్టెంట్లకు, కూలీలకు ఉపాధి కల్పించాలని కోరారు. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎఫ్‌టిఇ అమలు చేయాలని, అర్హత, అనుభవం కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. జూనియర్ మేట్, సీనియర్ మేట్, ఫీల్డ్ అసిస్టెంట్ అనే తారతమ్యం లేకుండా అందరినీ ఫీల్డ్ అసిస్టెంట్‌గానే కొనసాగించాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియాను అమలు చేయాలన్నారు. ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్ నవీన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో యూనియన్ నాయకులు వర్మ, ఎల్.శ్రీనివాస్, పి.రవి, డి.ధర్మారావు, ఎం.రామసత్యంనాయుడు, ఎన్.రామారావు, ఎస్.మోహన్, పాపారావు, ఎం.మణి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

భూ సర్వేపై అసత్యాలను నమ్మొద్దు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

భూ సర్వేపై విపక్షాలు చేసే అసత్య ప్రచారాలను చెప్పే నమ్మొద్దని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రజలను కోరారు. మండలంలోని గూడెంలో రూ.61.8 లక్షలతో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రం భవనాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వేల గురించి తెలుగుదేశం పార్టీ నాయకుడు లోకేష్‌కు ఏం తెలుసునని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఉండే చంద్రబాబు, లోకేష్ రాష్ట్రంలో శాశ్వత నివాసాలు ఏర్పరుచుకుని అప్పుడు మాట్లాడాలన్నారు. భూ సర్వేలతో గ్రామాల్లో తగాదాలు తగ్గుముఖం పట్టాయని చెప్పారు. పరిపాలనా వికేంద్రీకరణతో సత్ఫలితాలు వచ్చాయని తెలిపారు. గ్రామస్తులెవరూ మండల కేంద్రానికి వెళ్లకుండా అన్నీ గ్రామంలోనే అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు భూ సమస్యలపై ఏనాడైనా దృష్టిపెట్టారా అని ప్రశ్నించారు. సర్వే, పాసు పుస్తకాలు, హద్దు రాళ్లు వేసేటప్పుడు ఎవరి వద్దా అధికారులు లంచాలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు.

టిడిపి హయాంలో ఏ పని చేయలన్నా జన్మభూమి కమిటీలను ప్రాధేయపడే పరిస్థితి ఉండేదన్నారు. ఆ కమిటీ సభ్యులు బ్రోకర్ల మాదిరిగా వ్యవహరించే వారని విమర్శించారు. చంద్రబాబుకు ఎన్నికల ముందే అన్ని గుర్తుకొస్తాయని ఎద్దేవా చేశారు. 2019 ఎన్నికలకు ముందు పెన్షన్ పెంచారని, వైసిపి మేనిఫెస్టోలో పెన్షన్ పెంచుతామని జగన్ హామీ ఇవ్వడమే అందుకు కారణమన్నారు. చంద్రబాబుకు అధికారం కట్టబెట్టాలని తప్పుడు వార్తలతో, అసత్య ప్రచారాలతో ఎల్లో మీడియాలో చూపించే వార్తలను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో ఎంపిపి అంబటి నిర్మల, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఎ.శ్రీనివాసరావు, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు చిట్టి జనార్ధనరావు, ఎఎంసి చైర్మన్ మూకళ్ల తాతబాబు, గేదెల చెంగళరావు, చిట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆరోగ్యశ్రీ చికిత్సల వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల జారీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. వర్చువల్ విధానంలో కలెక్టరేట్ నుంచి స్పీకర్ సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని మరింత విస్తృతపరచడం ద్వారా ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందుతుందన్నారు. కొత్తగా రూపొందించిన ఆరోగ్యశ్రీ కార్డులో క్యూఆర్ కోడ్, లబ్ధిదారుల ఫొటో, కుటుంబ యజమాని పేరు, ఫోన్ నంబరు, కుటుంబ సభ్యుల వివరాలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో పొందుపరిచిన లబ్ధిదారుని ఆరోగ్య వివరాలు ఉంటాయన్నారు. ఈ క్యూఆర్ కోడ్‌తో లాగిన్ కావడం ద్వారా రోగి చేయించుకునే వ్యాధి నిర్ధారణ పరీక్షలు, తీసుకుంటున్న వైద్యం, చికిత్సలు, డాక్టరు సిఫార్సులు, సమీపంలోని ఆసుపత్రులు, ఆ ఆసుపత్రులకు చేరేందుకు గూగుల్ మ్యాప్స్ ద్వారా అనుసంధానించబడిన మార్గాలు, ఆరోగ్య మిత్ర కాంటాక్ట్ నెంబర్లు తెలుసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఆరోగ్యశ్రీలో చికిత్స తీసుకున్న రోగి పూర్తిగా కోలుకొని తిరిగి పనుల్లోకి వెళ్లే వరకు వారి జీవనోపాధికి ఎలాంటి లోటు లేకుండా రోజుకు రూ.225 చొప్పున నెలకు రూ.ఐదు వేలు, రెండు నెలలైతే రూ.పది వేలు డాక్టర్ల సూచన మేరకు ఆరోగ్య ఆసరా అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త పి.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

పాలనలో విప్లవాత్మక మార్పులు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తోటాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ హయాంలో చేకూరిన లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, సేదం... ఈ మూడు రంగాలకు పెద్దపీట వేస్తోందన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. ప్రతి పేదవానికి మెరుగైన వైద్యం అందాలనే ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు.

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను శతశాతం పూర్తి చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ప్రజలకు సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ మెట్ట శారద, ఎంపిటిసి తాండ్ర లక్ష్మి, మాజీ ఎంపిటిసి గురుగుబెల్లి ప్రభాకరరావు, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు, విద్యుత్‌శాఖ ఎఇ రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చంద్రమౌళి, ఎపిఎం పైడి కూర్మారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

'స్పందన'కు 290 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా 290 వినతులు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయదేవి వినతులను స్వీకరించారు. ఉద్దానం జీవనాధార పంటైన జీడికి గిట్టుబాటు ధర కల్పించి, రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని యుడిఎఫ్ అధ్యక్షులు సొర్ర రామారావు వినతిపత్రం అందజేశారు. తన కుటుంబ ఆర్థిక పరిస్థితుల రీత్యా కళాశాల ఫీజు చెల్లించకపోవడంతో టిసి ఇవ్వలేదని, టిసి ఇప్పించాలని సారవకోట మండలం ధర్మలక్ష్మీపురానికి చెందిన జె.సాయిచరణ్ తేజ్ వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని బూర్జ మండలం టిడిఆర్‌ఒ పేటకు చెందిన బండారి రాము ఫిర్యాదు చేశారు. ఆ స్థలాలను స్వాధీనం చేసుకుని బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. గార మండలం రజక వీధిలో కాలువలు లేక వీధి మురికివాడగా మారుతోందని, కాలువ నిర్మించేలని ఆ వీధికి చెందిన సింగూరు కిరణ్ కుమార్ వినతిపత్రం అందజేశారు. బిసి కార్పొరేషన్ నిధులు పక్కదారి పట్టించి ప్రభుత్వం బిసిలకు తీరని అన్యాయం చేసిందని, కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని బిజెపి ఒబిసి మోర్చా అధ్యక్షులు కరుణాకర్ ఫిర్యాదు చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బిజెపి జిల్లా అధ్యక్షులు బి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు శవ్వాన ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు. కోటబొమ్మాళి మేజరు పంచాయతీ పరిధిలో పలువురు అక్రమణదారులు ప్రభుత్వ భూములను అక్రమించి శాశ్వత భవనాలు, షాపులు నిర్మించుకున్నారని, వాటిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి ప్రభుత్వ భూములను అక్రమణదారుల నుంచి కాపాడాలని సర్పంచ్ కాళ్ల సంజీవరావు కోరారు.

అర్జీదారునికి ఇచ్చే సమాధానం పూర్తి వివరాలతో ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ స్పష్టం చేశారు. అందరు విభాగాధిపతులు ప్రజల నుంచి వచ్చే అర్జీలపై అత్యంత శ్రద్ధ వహించి పరిష్కారం చూపాలన్నారు. జగనన్నకు చెబుదాం వెబ్‌సైట్ ద్వారా, జగనన్నకు చెబుదాంలో 1902 నంబరుకు ప్రజలు తెలియజేసే సమస్యలను గడువు లోపు పరిష్కరించాలని ఆదేశించారు. వినతుల పరిష్కారంలో ఆలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, డిఎస్‌ఒ వెంకటరమణ, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

పెరటి కోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి- పోలాకి

స్వయంశక్తి సంఘం సభ్యులు పెరట కోళ్ల పెంపకం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం వద్ద పెరట కోళ్ల యూనిట్లను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిరు వ్యాపారాలు చేసి తద్వారా కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఎపిఎం రాజారావు మాట్లాడుతూ మండలానికి 47 యూనిట్లు మంజూరు అయ్యాయని, ఒక్కో యూనిట్‌కు రూ.3970 ఖర్చు అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ ప్రతినిధి మజ్జి లక్ష్మీనారాయణ, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్‌కుమార్, వైసిపి నాయకులు ఆర్.త్రినాథరావు, డాక్టర్ సన్యాసిరావు, ఎసి కొండలరావు, ఎపిఎం జి.రాజారావు పాల్గొన్నారు.

మంత్రితో మాట్లాడుతున్న నాయకులు

చర్చలకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి- పలాస

జీడికి గిట్టుబాటు ధర కల్పించాలని, 80 కేజీల బస్తా రూ.16 వేలకు రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, కొబ్బరి రైతుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 14న పలాసలో సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లామని, సిఎం పిఎస్ ధనంజయ రెడ్డితో చర్చిస్తామని సిఎం ఇచ్చిన హామీనిచ్చారని జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ అన్నారు. మంత్రి కార్యాలయంలో పశుసంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును సోమవారం జీడి రైతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం పిఎస్ ధనుంజయ రెడ్డితో చర్చలు జరిపించాలని కోరారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో ఎపి కొబ్బరి రైతు సంఘం కో-కన్వీనర్లు సాతుపల్లి కృష్ణారావు, బత్తిని లక్ష్మీనారాయణ, కుత్తుం వినోద్, కోనేరు గురయ్యా, మద్దిలి రామారావు, సీతారామయ్య, పిఎసిఎస్ వైస్‌చైర్మన్ జినగ లోకేశ్వరి పాల్గొన్నారు.

నేడు లావేరు మండల బడ్జెట్ సమావేశం

లావేరు : లావేరు మండల పరిషత్ బడ్జెట్ సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఒ కుప్పలి సురేష్ కుమార్ తెలిపారు. ఈ బడ్జెట్ సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని ప్రకటనలో తెలిపారు.

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలను నగరంలో 80అడుగుల రోడ్డులో ప్రజాసదన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు చింతల రామకృష్ణ హాజరై అభిమానులు, పార్టీ నాయకుల నడుమ కేక్‌కట్ చేశారు. అనంతరం నగరంలో రక్తదాన శిబిరం, వివిధ అనాథ శరణాలయాల్లో అన్న వితరణ, ప్రభుత్వ సర్వజనా సుపత్రిలో రోగులకు పండ్లు, మిఠాయిలు పంచి పెట్టారు. నగరంలో ఏడురోడ్ల కూడలిలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ ఆధ్వర్యాన పేదలకు దుప్పట్లు పంచిపెట్టారు. టిడిపి నాయకులు, మెండ దాసునాయుడు, నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, పార్టీ నాయకులు బోయిన గోవిందరాజులు, సింతు సుధాకర్, జామి భీమశంకరరావు, కొర్ను నాగార్జున ప్రతాప్, చిట్టి మోహన్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, శీర రమణ, గుండ భాస్కరరావు, గొండు వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.

ఆమదాలవలస : ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలను టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో రైల్వేస్టేషన్ ఆవరణలో కేక్‌నుకట్ చేసి పలువురికి పంచిపెట్టారు. టిడిపి సీనియర్ నాయకుడు బోర గోవిందరావు మాట్లాడుతూ తెలుగువారి ఖ్యాతిని దేశ రాజధానిలో నలు దిశల వ్యాపింపజేసిన వ్యక్తి రామ్మోహన్ నాయుడని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బివి.రమణమూర్తి, లంక నాగరాజు, ఎన్ని శ్రీదేవి, దవల అప్పలనాయుడు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : లక్ష్మీదేవికి కేక్ తినిపిస్తున్న కార్యకర్తలు

సరుబుజ్జిలి : మండల కేంద్రంలో ఎంపీ రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేకును కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివాల సూర్యనారాయణ, మండల టిడిపి అధ్యక్షులు అంబల రాంబాబు, జిల్లా తూర్పుకాపు సాధికార నాయకులు పల్లి సురేష్, టిడిపి నాయకులు కొర్ను సూర్యనారాయణ, కొమనాపల్లి రవికుమార్, దవల సింహాచలం, తాడేల వెంకటరమణ, లావేటి పూర్ణారావు, దొరబాబు పాల్గొన్నారు.

బూర్జ: మండల కేంద్రమైన బూర్జలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు పుట్టినరోజు వేడుకలు మండల పార్టీ అధ్యక్షులు సీతారాంబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా శివాలయంలో పూజలు నిర్వహించి అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి వీరుకట్ల ప్రభాకరరావు, సీతబాబు, సర్పంచ్ లంక జగన్నాథం, కృష్ణ గిరి, పోలి నాయుడు పాల్గొన్నారు.

కవిటి: ఎంపీ పుట్టినరోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే బెందాళం అశోక్ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. బెజ్జిపుట్టుగ చక్ర పెరుమాళ్ ఆలయంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు పి.కృష్ణారావు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

పలాస : పలాస టిడిపి కార్యాలయంలో ఎంపీ జన్మదిన సందర్భంగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కేక్‌ను కట్ చేసి మిఠాయి పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బి.నాగరాజు, మల్లా శ్రీనివాసరావు, డొక్క శంకర్, అంబటి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మందస : మండలంలోని హరిపురం టిడిపి కార్యాలయంలో ఎంపీ పుట్టిన రోజు సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి తాతారావు, బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు

పోలాకి : ఎంపీ జన్మదినం సందర్భంగా పోలాకి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, వృద్ధులకు పళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.వెంకట అప్పలనాయుడు, లుకలాపు రాంబాబు, అప్పలరెడ్డి, ముప్పిడి సింహాచలం, దంత సింహాచలంపాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని జలకలింగుపురంలో ఎంపీ జన్మదిన సందర్భంగా స్థానిక సర్పంచ్ రవ్వల అనురాధ, ప్రతినిధి గణపతిరావు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ గౌడ, మండల ప్రధాన కార్యదర్శి ఉర్లాన వసంత్, మండల జనసేన నాయకులు దుక్క బాలరాజు, రవ్వల దుర్గారావు, సౌందర్య, ఆనందరావు, శంకర్, అప్పారావు పాల్గొన్నారు.

కవిటి : కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం : ఎంపీ జన్మదినాన్ని పురస్కరించుని టిడిపి నాయకులు కాళ్ల ధర్మారావు, సాలీనా ఢిల్లీ యాదవ్, నందిక జాని, దక్కత ఢిల్లీరావు, కొండ శంకర్‌రెడ్డి, లీలారాణి, పద్మనాభం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

కొత్తూరు : స్థానిక కలమట కాంప్లెక్స్‌లో ఎంపీ పుట్టిన రోజును పురస్కరించుకుని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, అగతముడి అరుణ్‌కుమార్, పెద్దిన అమర్‌నాథ్, మాతల గాంధీ, యువజన నాయకులు చింతాడ కోటేశ్వరరావులు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

టెక్కలి : స్థానిక టిడిపి కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి హనుమంతు రామకృష్ణ, చాపర గణపతి, పోలాకి షణ్ముఖరావు, మహిళా అధ్యక్షులు మెండ దమయంతి, మామిడి రాము, మట్ట పురుషోత్తం, సుందరమ్మ, కోళ్ల లవకుమార్, కామేష్, దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్‌చంద్, జీరు వెంకటరెడ్డి, గండి చంద్రరావు, మల్లిపెద్ది మధు, ఇప్పిలి జగదీష్, ఎస్.కిరణ్‌కుమార్‌లు ఎంపీ జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్ చేశారు.

కోటబొమ్మాళి: స్థానిక టిడిపి కార్యాలయంలో ఎంపీ జన్మదిన సందర్భంగా టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్, మాజీ ఎంపి తర్ర రామకృష్ణ, ఎంపిటిసి పట్ట సింహాచలం, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

టెక్కలి : సమగ్ర శిక్ష కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని మండల రిసోర్స్ కార్యాలయ ఉద్యోగి రవి కోరారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన సమయంలో మండల రిసోర్స్ కార్యాలయం ముందు ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. ముందుగా కార్యాలయం ఆవరణలోని సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం ఇచ్చిన హామీని ఆమలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ 20 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని మెచ్చరించారు. కార్యక్రమంలో సంతోష్, రాంబాబు, మల్లేష్, రాజు, రాజ్యలక్ష్మి, రమేష్, జగదీష్, సుందరరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : సమగ్ర శిక్షా విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. గత నాలుగు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం ఇంకా రెండు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మినిమం టైం స్కేల్ ఇస్తామని చెప్పి మర్చిపోయారన్నారు. 16 నుంచి 19 వరకు పెన్‌డౌన్ చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు 20 నుంచి సమ్మెకు దిగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సిబ్బందికి డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ తరపున పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటించి సంఘీభావం తెలుపుతున్నామన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, న్యాయబద్ధంగా రావాల్సిన అన్ని బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

టెక్కలి : విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ఆమదాలవలస : పట్టణంలో ఎంఇఒ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు పెన్‌డౌన్ చేపట్టి విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి నర్సింగరావు, ఎంవి. రమణ, శ్రీను, శైలజ, జ్యోతి, చంద్రకళ, ధనలక్ష్మి, శ్రీను, ప్రసాద్, ముత్యాలరావు, వరహాల నాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీకి నిధుల పెంపుపై హర్షం

కవిటి: ఆరోగ్యశ్రీ పరిధిలో రోగులకు చేస్తున్న ఖర్చు పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంపై ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయం బడుగు, బలహీన వర్గాలపై తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి తెలియజేస్తోందని అన్నారు. గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ కింద ఏడాదికి రూ.1034 కోట్లు మాత్రమే ఖర్చు పెడితే, తమ ప్రభుత్వం రూ.4,100లు ఖర్చు పెడుతున్నట్టు తెలిపారు. కిడ్నీ వ్యాధి నిర్మూలనకు పలాసలో రూ.85 కోట్లు కేటాయించి కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నిర్మించడం ముఖ్యమంత్రి చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పూడి నీలాచలం, పాండవ శేఖర్, యలమంచి నీలయ్య, బద్రి ప్రకాష్, ఎన్ని అశోక్, ఎస్.పి.ప్రవీణ్, డి.ధర్మారావు, సత్యం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రకాష్

సమీక్షిస్తున్న వాణి

'గడప గడప'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మేజర్ పంచాయతీ సచివాలయం-5 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రజలు ఇప్పటివరకు లబ్ధిపొందిన జాబితా ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలతో పాటు సంక్షేమ పథకాలు అందరికీ అందేవిధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఆట్లా సరోజనమ్మ, ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి, వైస్ ఎంపిపి కిషోర్, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్లు

ఆర్‌టిసి ప్రయాణికులకు బహుమతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం-1, 2వ డిపోల నుంచి వివిధ మార్గాల్లో నడపుతున్న ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం చేసి గిఫ్ట్‌స్కీంలో ఎంపికైన ప్రయాణికులకు సోమవారం డిపోల మేనేజర్లు మల్లికార్జునరాజు, శర్మ బహుమతులు అందజేశారు. ఈ నెల 1 నుంచి 16 వరకు రెండు డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో ఆమదాలవలస, చీపురుపల్లి, బందరువానిపేట, సాలూరు, విజయనగరం, జి.కె.వలస, యరగాం, శ్రీముఖలింగం రూట్లలో ప్రయాణం చేసిన ప్రయాణికులకు డ్రా తీశారు. ఇందులో సాలూరు మార్గంలో వేణుగోపాల్ మధుసూదనరావు, చీపురుపల్లి మార్గంలో నారాయణరావు, చందు, బందరువానిపేట మార్గంలో గుప్త, రోహిత్, ఆమదాలవలస మార్గంలో కృష్ణారావు, విజయనగరం మార్గంలో వికె.సత్యవతి, చలపతి, యరగాం మార్గంలో డి.భువనేశ్వర్, జి.కె.వలస మార్గంలో రామన్న, అశోక్, శ్రీముఖలింగం మార్గంలో వెంకటరమణ, గణేష్‌బాబు, శంకర్ ఎంపికయ్యారు. విజేతలకు దామోదరరావు, బోయిన పృథ్వీ, ఊన్న కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

వజ్రపుకొత్తూరు: మండలంలోని అక్కుపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని కాశీబుగ్గ ఐసిడిఎస్ పిఒ డి.శార్వాణి సోమవారం తనిఖీ చేశారు. అక్కుపల్లి అంగన్వాడీ కేంద్రం నుంచి బియ్యం తరలిపోతున్నాయని అనుమానంతో గరుడభద్ర వద్ద ఆదివారం పట్టుకున్నారు. దీంతో స్పందించిన పిఒ తనిఖీ చేపట్టి రికార్డులను పరిశీలించారు. ప్రారంభ, ముగింపు నిల్వలను పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తను పిలించి పలు ప్రశ్నలు వేశారు. పట్టుబడిన బియ్యం అంగన్వాడీకి సంబంధించినవా? లేదా? పరీక్షలకు శాంపిల్ పంపిస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఆమెతో పాటు సూపర్ వైజర్ పి.గంగమ్మ, విమర్శ, ఇందిరా ప్రియదర్శిని ఉన్నారు.

నేత్రాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- రణస్థలం

నేత్రాలపై అప్రమత్తంగా ఉండాలని కళ్యాణి నేత్ర ఆస్పత్రి పారామెడికల్ అప్తాలమిక్ అధికారి ఎస్.కళ్యాణి తెలిపారు. మండల కేంద్రం బ్రహ్మణ వీధిలో ఉన్న కళ్యాణి కంటి ఆస్పత్రి ఆవరణలో సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 93 మంది హాజరయ్యారు. వైద్య పరీక్షలు నిర్వహించి 13 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేసి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ కంప్యూటర్ ముందు ఎక్కువసేపు పనిచేసేవారు తప్పనిసరిగా మధ్యలో కాస్త విరామం తీసుకోవాలని, అలాగే కంటి రెప్పలను ఆడిస్తుండాలన్నారు. క్యారెట్, తాజా పండ్లు, ఆకుకూరలు, పాలు, గుడ్డులోని పచ్చసొనల్లో విటమిన్ ఎ ఉంటుందని ఇది కంటి ఆరోగ్యానికి మంచిదన్నారు.

చికిత్స కోసం వెళ్తున్న రోగులు

పోలీస్ స్పందనకు 29 వినతులు

ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

స్పందన ఫిర్యాదులు చట్ట ప్రకారం కచ్చితంగా పరిష్కారం చూపాలని, పునరావృతం కాకూడదని పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదేశించారు. సోమవారం ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్‌పితో పాటు అదనపు ఎస్‌పిలు విఎన్ మణికంఠ, జె.తిప్పేస్వామి ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకొని ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు 29 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో ఫిర్యాదుదారులు 'స్పందన' ఫిర్యాదులను మీ పరిధిలోని పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చుని, ఫిర్యాదుదారుల సమస్యలను నిర్ణీత సమయంలో విచారించి పరిష్కరిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

1న జీతాలు చెల్లించాలి

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు ప్రతినెలా 1న జీతాలు చెల్లించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని డిఆర్‌ఒ వి.గణపతిరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 19 నుంచి 21 వరకు ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతిపత్రాలు అందజేస్తామని అన్నారు. 27న తాలూకా, డివిజన్ కేంద్రాల్లో ఆరు గంటల ధర్నా, జనవరి 3న కలెక్టర్ కార్యాలయం వద్ద 12 గంటల ధర్నా, జనవరి 7,8 తేదీల్లో రాష్ట్ర కేంద్రంలో 36 గంటల ధర్నా చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. రెండేళ్లుగా సకాలంలో జీతాలు చెల్లించకుండా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని అన్నారు. 15 వరకు చాలామందికి జీతాలు చెల్లించడం లేదని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. బ్యాంకు లోన్లు కలిగిన వారికి ప్రతినెలా సకాలంలో వాయిదాలు చెల్లించనందున పెనాల్టీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గతంలో ఉద్యోగుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్‌లో పిఆర్‌సి, డిఎ ఎరియర్స్, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవులు తదితర బకాయిలను సెప్టెంబరు నెలాఖరులోగా చెల్లిస్తామని హామీ ఇప్పటికీ నెరవేరలేదని అన్నారు. ఈయనతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, జిల్లా నాయకులు ఎల్.కోదండరామయ్య ఉన్నారు.

యువగళం సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పలాస

విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం పొలిపల్లిలో ఈ నెల 20న నిర్వహించనున్న యువగళం విజయోత్సవ సభ విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష టిడిపి, జనసేన నాయకులకు కోరారు. పలాస టిడిపి కార్యాలయంలో సోమవారం క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువగళానికి ఎంతమంది వస్తున్నారో ముందుగా కార్యాలయానికి తెలియజేయాలన్నారు. వచ్చిన కార్యకర్తలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటామని స్పష్టంచేశారు. యువగళం ఏర్పాట్లు ప్రత్యేక పర్యవేక్షకుడు హరిబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బాబురావు, జనసేన నాయకులు దుర్గారావు, టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి విఠల్, గాలి కృష్ణారావు, బి.నాగరాజు, నవీన్, సంతోష్, గోపాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గౌతు శిరీష

న్యాయవాదిని పరామర్శ

కాశీబుగ్గలో నివాసం ఉంటున్న న్యాయవాది పిండి వెంకటరావు, డ్రైవర్ ధర్మారావులు ఇటీవల సోంపేట లక్కవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష వారి గృహాలకు వెళ్లి పరామర్శించారు. ఆమెతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, నవీన్, గురిటి సూర్యనారాయణ, నాబిల్లి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

జనగళంగా మారిన యువగళం

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ యువగళం పేరుతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర ప్రజల స్పందనతో జనగళంగా మారిందని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. సోమవారం మండలంలో పెద్దపాలెం గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర ప్రజాస్పందన చూసిన సిఎం జగన్మోహన్ రెడ్డికి, వైసిపి నాయకులకు మతిభ్రమించి కొట్టుమిట్టాడుతున్నారన్నారు. 226 రోజులు 3,132 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకున్న యువగళం ముగింపు విజయోత్సవ సభ ఈనెల 20న విజయనగరం జిల్లా పోలిపల్లి గ్రామం వద్ద భారీ బహిరంగ సభ జరగనుందని తెలిపారు. ఈ సభను నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గజ్జని కృష్ణారావు, నాగం రమేష్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శ

మండలంలో బొడ్డేపల్లి, కేశవదాసుపురం గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టిడిపి సానుభూతిపరుల కుటుంబ సభ్యులను సోమవారం టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు గాడు నారాయణరావు, మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి సత్యం, పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

మాట్లాడుతున్న రవికుమార్

21న రాత పరీక్ష

బూర్జ : సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యాన పాలకొండలో నూతనంగా ప్రారంభించనున్న హెచ్‌పి పెట్రోల్ బంక్‌లో సూపర్‌వైజర్, పంపు బాయ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొన్న గిరిజన అభ్యర్థులకు ఈనెల 21న ఉదయం 10:30 గంటలకు సీతంపేట ఐటిడిఎలో రాతపరీక్ష నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట, పాలకొండ, భామిని, వీరఘట్టం, బూర్జ, హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట, మందస, మెళియాపుట్టి, పాతపట్నం, సారవకోట మండలాల నుంచి దరఖాస్తు చేసుకొన్న గిరిజన అభ్యర్థులు రాతపరీక్షకు హాజరుకావాలని కోరారు. దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థుల్లో 21 నిండని వారు, 35 ఏళ్లు పైబడినవారు, ఇంటర్మీడియట్ పాస్ కానీ వారు ఈ రాతపరీక్షకు అనర్హులని తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికి మళ్లీ జగనే రావాలి

సోంపేట : మాట్లాడుతున్న ఎంపిపి దాసు

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రం మరింతగా అభివృద్ధి సాధించడానికి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్ అన్నారు. మండలం నందివాడ గ్రామంలో సోమవారం వై నీడ్స్ ఎపి జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి, గ్రామంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన బోర్డును ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మజ్జి శైలజ, మొకర శంకరరావు, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకటకృష్ణారావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని ఉప్పలాం సచివాలయ పరిధిలో సోమవారం వె ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు నిర్వహించారు. వైసిపి ప్రభుత్వం ఉప్పలాం పంచాయతీ పరిధిలో వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు రూ.21 కోట్లు లబ్ధి చేకూర్చిందన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు సిలగాన భాస్కరరావు, జెసిఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ, సర్పంచ్ బట్టి మాధవరావు, ఎంపిటిసి ప్రతినిధి రాజు, వెంకటరావు పాల్గొన్నారు.

అప్పలనాయుడు పరామర్శ

లావేరు : తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్‌ను ఎచ్చెర్ల నియోజకవర్గం వైసిపి సీనియర్ నాయకులు లుకలాపు అప్పలనాయుడు సోమవారం శ్రీకాకుళంలో పరామర్శించారు. శ్రీకాంత్‌కు ఇటీవల కాలుకు గాయంకావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న లుకలాపు అప్పలనాయుడు, రణస్థలం వ్యవసాయ సలహామండలి చైర్మన్ పైడి శ్రీనివాసురావు పరామర్శించారు. వీరితోపాటు కొత్తకోట మాజీ సర్పంచ్ ఎస్.నాగరాజు, జగన్, రాగూర్, పతివాడ గురునాయుడు ఉన్నారు.

శ్రీకాంత్‌ను పరామర్శిస్తున్న ఎచ్చెర్ల వైసిపి నాయకులు

గెలుపొందిన విద్యార్థులతో పగడాలమ్మ

చాపరలో సైన్స్ ఎగ్జిబిషన్

మెళియాపుట్టి: దక్షిణ భారతదేశ విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా సోమవారం చాపర ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌కి మండలంలోని 14 ఉన్నత పాఠశాలల నుంచి వ్యక్తిగత, సామూహిక, ఉపాధ్యాయ ప్రాజెక్టులు మొత్తం 70 ప్రాజెక్టులు ప్రదర్శించారు. వ్యక్తిగత ప్రాజెక్టులో భాగంగా చేపల ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.యశ్విని‌కి ప్రథమ బహుమతి లభించింది. గొప్పిలి ఉన్నత పాఠశాలకు చెందిన కె.ప్రశాంత్‌కు ద్వితీయ బహుమతి లభించింది. సామూహిక ప్రాజెక్టులో భాగంగా చాపర పాఠశాలకు ప్రథమ, జాడుపల్లి పాఠశాలకు ద్వితీయ బహుమతులు లభించాయి. ఉపాధ్యాయ ప్రాజెక్టులో భాగంగా పెద్దపద్మపురం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఎం.నిరంజన్‌కు ప్రథమ బహుమతి లభించింది. గెలుపొందిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు టెక్కలి డిప్యూటీ డిఇఒ గార పగడాలమ్మ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్.దేవేందర్‌రావు, ఎం.పద్మనాభరావు, మెళియాపుట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వైకుంఠరావు, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం టి.సుధారాణి పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక మార్పు

మాట్లాడుతున్న వేణుగోపాల్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమవుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్ (జిఇఒ) ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పెల్ బి పోటీలు నిర్వహణ, ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు అందజేసే కార్యక్రమం నగరంలో బాపూజీ కళామందిర్‌లో నిర్వహించారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు అవసరమైన అవగాహన, స్పెల్ బీ పోటీలో పాల్గొనే విద్యార్థులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత జెడ్‌పి సిఇఒ సురంగి మోహనరావు మాట్లాడుతూ కష్టం లేకుండా ఫలితం రాదని, విజయానికి దగ్గర దారులంటూ ఏమీ ఉండవన్నారు. జెఎన్‌టియు సభ్యులు దుప్పల వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ముందుకు సాగితే విజయం సాధించవచ్చన్నారు. సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ మాట్లాడుతూ జిఇఒ సంస్థ ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విద్యాభివృద్ధికి పాటు పడడం గొప్ప విషయమన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శర్వాణి విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ సత్యవాణి, జెసిఐ గ్రీన్‌సిటీ అధ్యక్షులు మణిశర్మ, ప్రభుత్వ కళాశాల టూరిజం లెక్చరర్ బి.వరలక్ష్మి, వినియోగదారుల సమాఖ్య సభ్యులు పి.ఉమ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ పూర్వ పాలకసభ్యులు పి.జయరాం, లయన్స్ క్లబ్ ప్రతినిధులు హారికా ప్రసాద్, శోభారాణి, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ వినోద్, జిఇఒ అధ్యక్షుడు సద్గుణ్, కమిటీ ప్రతినిధులు స్వరూప్, ఉమ పాల్గొన్నారు.

నేరాల అదుపునకు ప్రత్యేక నిఘా

కాశీబుగ్గ సిఐ నవీన్ కుమార్

నవీన్‌కుమార్

ప్రజాశక్తి- పలాస

వలాస-కాశీబుగ్గ ప్రాంతంలో నేరాల అదువునకు ప్రత్యేక నిఘా పెట్టామని కాశీబుగ్గ సిఐ నవినుమాన్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో వజ్రవుకొత్తూరు ఎస్ఐగా వని చేసిన అనుభవంతో పాటు ఈ ప్రాంతంపై పూర్తిగా అవగాహన ఉందన్నారు. ప్రధానంగా జంట పట్టణాల్లో ట్రాఫిక్ పెరుగుతుందని, వాటిని నియంత్రణకు కృషి చేస్తామని అన్నారు. ముఖ్యంగా యువత చెడు మార్గాల్లో వెళ్లకుండా సన్మార్గంలో పయనించేందుకు దృష్టిసారించామన్నారు. ద్విచక్ర వాహనాలపై ముగ్గురు వెళ్లరాదని సూచించారు. ఆటో వేగం నియంత్రించేందుకు డ్రైవర్లు కృషి చేయాలన్నారు. బంకేశ్వరగుడి మార్గం గతంలో వన్ వేగా ఉండేదని, దానిని పున్నరుద్ధరించాలని విలేకరులు సూచించగా, అందుకు సానుకూలంగా స్పందించారు. పండగల సమయంలో వేరే ప్రాంతానికి వెళ్లేవారు పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలన్నారు.

చెక్కును అందజేస్తున్న కలెక్టర్

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో కోటబొమ్మాళి మండలం లఖందిడ్డి గ్రామానికి చెందిన కూటికుప్పల వెంకటరమణ, అతని సోదరి కూటికుప్పల జ్యోతిలు జన్యుపరమైన అరుదైన కోన్రాడ్ డిస్ట్రోఫీ అనే కంటి సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. తమ వైద్య ఖర్చుల నిమిత్తం నెలకు రూ. పదివేలు అవసరం అవుతున్నట్టు ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2లక్షల సాయాన్ని విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సోమవారం కలెక్టరేట్‌లో రూ.2లక్షల చెక్కును బాధితులకు అందజేశారు.

విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- కొత్తూరు

గణిత ఉపాధ్యాయుల జిల్లా వేదిక ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలోని ఇటీవల నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్ష క్విజ్ పోటీలో మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు డి.లక్ష్మీనరసింహ, గణిత ఉపాధ్యాయులు దండు ప్రకాశరావు, సిహెచ్.లక్ష్మి, కె.స్వాతి విద్యార్థులను సోమవారం అభినందించారు. మండల స్థాయిలో నిర్వహించిన సీనియర్ క్విజ్ పోటీలలో ప్రథమ స్థానాన్న జూనియర్ క్విజ్ పోటీలో తృతీయ స్థానాన్ని సాధించారు. అదేవిధంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన ప్రతిభా పరీక్షలో ఏడో స్థానాన్ని 9వ తరగతి విద్యార్థి టి.ఉదయ్ కుమార్ సాధించాడు. పదో తరగతి నుంచి బి.సాయిచరణ్, బి.జస్వంత్‌లు టాపర్స్‌గా నిలిచారు, వీరికి జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పగడాలమ్మ, గణిత ఉపాధ్యాయ వేదిక ప్రతినిధులు విజేతలకు ప్రశంసాపత్రాలను, జ్ఞాపకలను అందజేశారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

కిడ్నీ బాధితునికి ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు : మండలంలోని రెయ్యిపాడుకు చెందిన మద్దిల ఉమ రెండు కిడ్నీలు చెడిపోవడంతో ఇబ్బందులు పడుతుంది. వైద్యం చేయడానికి రూ.25 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పడంతో దిగాలు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు ముందుకొచ్చింది. వైద్య ఖర్చుల కోసం రూ.10 వేలు సోమవారం ఆర్థికసాయం అందించారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సొసైటీ ఫౌండర్ విజయకుమార్ కోరారు. కార్యక్రమంలో కీలు ఈశ్వరరావు, వెంకటేష్, హేమారావు, శివాజీ పాల్గొన్నారు.

నిమ్మాడ విద్యార్థి ప్రతిభ

దిలీప్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం

కోటబొమ్మాళి: మండలంలోని నిమ్మాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న కర్రి దిలీప్ అండర్-14 విభాగంలో జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వి.రమణమూర్తి సోమవారం తెలిపారు. దిలీప్ ఈ నెల 22 నుంచి భువనేశ్వర్‌లో జరిగే జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలలో పాల్గొంటాడని అన్నారు. దిలీప్‌కు హెచ్‌ఎంతో పాటు పిఇటి, ఉపాధ్యాయులు ఎన్.జగదీష్‌లు అభినందించారు.

టివి మెకానిక్ షాపు దగ్ధం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక అయ్యప్పగుడి సమీపంలో గవరరాజు టివి మెకానిక్ షాపులో ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కారణంగా దగ్ధమైంది. ఎకానిక్ దగ్ధమయ్యాయి. టివిలు మరమ్మతుల కోసం ఇవ్వడంతో అధికంగా ఉన్నాయి. అగ్నిప్రమాదంలో టివి పిక్చర్ ట్యూబ్‌లు పేలడంతో దట్టమైన పొగలు అవరించాయి. వెంటనే చుట్టుపక్కల వారు గమనించి స్థానిక అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది ఆస్తినష్టం అంచనా వేస్తున్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణయ్య తదితరులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

భారత రాజ్యాంగాన్ని మార్చి మనువాద సిద్ధాంతాన్ని భారత రాజ్యాంగంగా ప్రజలకు పరిచయం చేయాలన్న దుర్మార్గపు ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం పూనుకుందని కుల నిర్మూలన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మనుస్మృతి దహనం కరపత్రాలను దళిత, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ మతోన్మాద భావజాల సిద్ధాంతాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాశ్రీ గణేష్, సమతా సైనిక దళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్ల రామారావు, కులనిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బెలామర ప్రభాకర్, డిటిఎఫ్ ధర్మారావు, సిఐటియు నాయకులు సణ్ముఖరావు, లక్ష్మి, వెంకటమ్మ, సిమ్మమ్మ, సరోజిని, తులసీ, నారాయణ పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు రిమ్స్ విద్యార్థి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటాచలం

జాతీయస్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల పెన్సింగ్ పోటీలకు రిమ్స్ వైద్య కళాశాల ప్రథమ సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్న విద్యార్థిని డి.నీలిమ ఎంపికయ్యారు. ఆమె వైఎస్ఆర్ విశ్వవిద్యాలయం తరపున హాజరవుతున్నారు. ఈనెల 23 నుంచి 26వరకు ఔరంగాబాద్‌లో ఎంజిఎం విశ్వ విద్యాలయం వేదికగా జగరనున్న జాతీయ పోటీల్లో ఆమె పాల్గొంటున్నారు. ఈనెల 12న సౌత్ వెస్ట్‌జోన్ ఇంటర్ విశ్వవిద్యాలయాల పెన్సింగ్ పోటీలు చినకాకానిలో ఉన్న ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన ఆమె జాతీయస్థాయి పోటీలకు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఆమెను రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వెంకటాచలం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కోటేశ్వరరావు, స్పోర్ట్సు కమిటీ చైర్మన్ డాక్టర్ జయరాజ్, వైస్ చైర్మన్ డాక్టర్ సనపల నర్సింహమూర్తి, ఫిజికల్ డైరక్టర్ బి.గౌరునాయుడులు అభినందించారు.

హెచ్‌ఐవి రోగులపై వివక్ష వద్దు

ప్రజాశక్తి- కవిటి

మాట్లాడుతున్న నాగభూషణరావు

హెచ్‌ఐవి అంటువ్యాధి కాదని,రోగులపై వివక్ష చూపించకూడదని, జిల్లా రిసోర్స్ పర్సన్ హనుమంతు నాగభూషణరావు అన్నారు. మండలంలోని కొజ్జిరియాలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యాన ఎపి శాక్స్ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ హెచ్‌ఐవి స్థితి పరీక్షించుకుని వ్యాధి లక్షణాలు, మందుల ఆవశ్యకత తెలుసుకోవాలని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో హెచ్‌ఐవి ఎయిడ్స్, టిబి, సుఖ వ్యాధుల నివారణ, నిర్మూలన, కండోమ్ ఉపయోగాలు, రక్తదానం ఆవశ్యకత తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలవేణి, కార్యదర్శి వై.రాజేష్, విఆర్ఒ పార్వతి, ఎంఎల్ హెచ్‌పి పార్థసారధి, జోనల్ సూపర్‌వైజర్ పి.సుధాకర్, క్లస్టర్ లింక్ వర్కర్ జి.రవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గృహస్థలాలను పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు

స్థల పరిశీలన

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో చీడివలస పంచాయతీ పరిధిలో గంగంపేట గ్రామంలో సోమవారం గృహ నిర్మాణశాఖ ఇఇ అప్పారావు జగనన్న శాశ్వత గృహహక్కు స్థలాన్ని పరిశీలించారు. చీడివలస సచివాలయ పరిధిలో గంగంపేట గ్రామంలో 16 మంది లబ్ధిదారులకు గృహహక్కు పట్టాలు ప్రభుత్వం మంజూరు చేయగా వాటిని లబ్ధిదారులకు అప్పగించేందుకు 16 గృహాలకు సరిపడ స్థలాన్ని పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లులేని పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలను, స్థలం ఇచ్చేందుకు ఈ స్థలాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించారని, వీటికి జంగిల్ క్లియరెన్స్, రోడ్లు, విద్యుత్, తాగునీరు ఏర్పాటు చేసేందుకు పరిశీలన చేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బూరి శ్రీరామ్మూర్తి, హౌసింగ్ వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంప్రసాద్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అన్నదానం చేస్తున్న సాయి

నగరంలో ఇందిరానగర్ కాలనీ వద్ద ఖ్యాతి వృద్ధాశ్రమంలో వయోవృద్ధులకు అన్నదాన వితరణ సోమవారం జరిగిందని నిర్వాహకులు డాక్టర్ ఆర్.శ్రావణి తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ ఎంపీ రామ్మోహన్ నాయుడు జన్మదినం సందర్భంగా జిల్ ఫౌండేషన్ సాయి, అన్నదానం చేయడం హర్షనీయమన్నారు. ఇందులో భాగంగా వృద్ధాశ్రమంలో వృద్ధులంతా ఎంపీ రామ్మోహన్ నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్ ఫౌండేషన్ అధ్యక్షులు సత్యసాయి, చేయూత మేమున్నాము అధ్యక్షులు వారణాసి వెంకట లక్ష్మి, బిహెచ్ఆర్‌సి మహిళా అధ్యక్షురాలు మణిశర్మ, మదర్స్ లవ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుప్రజా, ప్రాణదాత శ్రావణ్, జర్నలిస్టు ఉర్లం శివతేజ, జిల్ ఫౌండేషన్ జడ సాయి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ సరోజని

పి.ఎల్ పురంలో భూ సర్వే

మెళియాపుట్టి : భూ రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పి.సరోజని సూచించారు. మండలంలోని పెద్దలక్ష్మీపురంలో భూ రీ సర్వేను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర భూ సర్వే అవకాశం కల్పించిందని అన్నారు. దీనివల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. గతంలో సాగు చేసి సాగుపత్రాలు లేని వారికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, గంగరాజుపురం సర్పంచ్ ప్రతినిధి శంకరరావు, విఆర్ఒ అన్నాజీరావు, కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

రుతుస్రావంపై అవగాహన

ప్రజాశక్తి- నరసన్నపేట

అవగాహన కల్పిస్తున్న మేరీ

ఆడ పిల్లలు సహజంగా ఎదుర్కొంటున్న రుతు స్రావం సమస్యలు, అపోహలపై స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి ఎ.మేరీ స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్లాస్టిక్ ప్యాడ్స్ స్థానంలో క్లాత్ ప్యాడ్స్ ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. రుతు స్రావం అనేది అనారోగ్యం కాదని పేర్కొన్నారు. ఈ అంశంపై ఇంట్లో చర్చించాలన్నారు. ఈ తరహా అవగాహనా కార్యక్రమాలు అన్ని పాఠశాలల్లోనూ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పద్మావతి సేవా విభాగం విద్యార్థినులు పాల్గొన్నారు.

విక్టరీ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు

5. మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రాజ్యాంగం ద్వారా ప్రజలందరికీ సమాన అవకాశాలను కల్పించడం ద్వారా ప్రతిఒక్కరూ ఇంకొకరికి సహాయం అందించడం ద్వారా దీనిని సాధించవచ్చునిడాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. వెనుకబడిన తరగతుల హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక విక్టరీ జూనియర్ కళాశాలలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధమని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, విద్యాసంస్థలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు దుంపల నర్సింహమూర్తి, వెలమల అప్పలనాయుడు, పంచిరెడ్డి అర్జునరావు, ఎఎస్ఐ కె.మన్మథరావు, విక్టర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతు శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

2007 చట్టాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న కొండబాబు

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల విషయంలో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా పార్లమెంటు ఓ చట్టాన్ని రూపొందించిందని, వయోవృద్ధుల సంక్షేమం, బాధ్యత 2007 చట్టాన్ని సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని నాగావళి హోటల్ ఎండి, సీనియర్ సిటిజన్ వరదా కొండబాబు కోరారు. నగరంలో రోటరీ క్లబ్ భవనంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. సీనియర్ సిటిజన్‌గా తల్లిదండ్రులు వద్ధాప్యంలో ఉన్న సమయంలో వారి పిల్లలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే వారిపై చట్టపరంగా పోరాడేందుకు సీనియర్ సిటిజన్స్‌కు ఓ చట్టం ఉందన్నారు. ఈ విషయం అనేక మందికి తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాను తన కష్టార్జితంతో నాగావళి హోటల్ నెలకొల్పానని, హోటల్‌ను నిర్వహించే శాశ్వత అనుమతులు కూడా పొందానన్నారు. ప్రస్తుతం తన కుమారుడు ఆనంద్‌కు హోటల్‌లో 20 శాతం వాటా మాత్రమే ఉందన్నారు. అయినప్పటికీ నా కుమారుడు, మనుమడు ఇద్దరూ కలిసి తనను హోటల్ నిర్వహణ బాధ్యతల నుంచి తప్పించి తనకు జీవన భృతికి కూడా ఇవ్వకుండా హోటల్ నుంచి తనను తరిమేశారన్నారు. తాను తన కుమార్తెలకు, తన కుమారుడికి సమానంగా హోటల్‌లో హక్కులు కల్పించేందుకు సిద్ధమవ్వగా, నా కుమారుడు ఆనంద్ సర్వహక్కులు తనకే ఇవ్వాలని, నాపై ఒడిపై తెస్తున్నాడని కొండబాబు ఆవేదన వ్యక్తం చేశారు. హోటల్‌ను తన కుమారుడు ఆనంద్ సొంతం చేసుకొని తనను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాడని, తనకు ఆదాయ మార్గంగా ఉండే హోటల్ నిర్వహణకు అనుమతించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వృద్ధ తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం, మెయింటెనెన్స్ యాక్ట్ 2007 చట్టాన్ని సక్రమంగా అమలు చేసి తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో రోటరీ సహాయక గవర్నర్ కె.కె.నాయుడు, సభ్యులు నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారిస్తున్నామని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నీలాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.6 లక్షల వ్యయంతో సిసి రోడ్లు, కాలువ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పార్టీలకతీతంగా అన్నీ వార్డులనూ అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, మున్సిపల్ ఎఇ అవినాష్, వార్డు కౌన్సిలర్ కర్రి మాధవరావు, నీలాపు నారాయణ పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో గ్రామాల అభివృద్ధి

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కవిటి

ఎంపీ నిధులు గ్రామాల అభివృద్ధికి దోహదపడతాయని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని రాజపురంలో రూ.5 లక్షల ఎంపీ నిధులతో సామాజిక భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ ఎంపీ నిధులతో ఏదో ఒక కార్యక్రమం చేపట్టామని తెలిపారు. నియోజకర్గ ప్రజలు కోరిన వెంటనే స్పందించి ఉదారంగా నిధులు మంజూరు చేస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పొందల కృష్ణారావు, సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్, పుల్లట సంతోష్, హరికృష్ణ బిసాయి, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో పాల్గొన్నారు.

వినోద్ మిశ్రాకు నివాళి

ప్రజాశక్తి- పలాస

నినాదాలు చేస్తున్న నాయకులు

వినోద్ మిశ్రా సిపిఐఎంఎల్ లిబరేషన్‌కు మూడుసార్లు జాతీయ కార్యదర్శిగా పనిచేసి తన దైనశైలిలో దేశ పరిస్థితిలకు తగినట్లుగా పార్టీని బలోపేతానికి కృషి చేశారని లిబరేషన్ జిల్లా నాయకులు మద్దిల రామరావు అన్నారు. మండలంలోని బొడ్డపాడు కాలనీలో సిపిఐఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యాన సోమవారం వినోద్ మిశ్రా వర్ధంతి వేడుకలను నిర్వహించారు. అలాగే జోహార్, భక్సీ, నాగభూషణం పట్నాయక్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ముందుగా విప్లవ పతాకాన్ని సీనియర్ సభ్యులు వంకల చంద్రయ్య, సారా పాపయ్యలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వంకల అప్పయ్య, మహిళా నాయకులు కోనారి ఈశ్వరమ్మ, పోతన పల్లి బాలరాజు, మద్దిల పాపారావు, మద్దిల వేమలయ్య, మద్దిల జగదీష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయోత్పత్తుల స్టాల్ ఏర్పాటు

ప్రజాశక్తి- పొందూరు



తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయోత్పత్తుల స్టాల్

మండల తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఉత్పత్తుల స్టాల్‌ను ఎపి సిఎస్ఎఫ్ సిబ్బంది ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయపద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, దుంపజాతి, ఇతర కూరగాయలను ప్రదర్శించి అమ్మకాలు జరిపారు. ఈ విధంగా ప్రతి సోమవారం మండల కేంద్రంలో స్టాల్ ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన వివిధ రకాల కూరగాయలు అందుబాటులో ఉంటాయని సిబ్బంది తెలిపారు.